కస్తూర్బా పాఠశాలలో వన్‌కేర్ సైకిల్ ప్రదర్శన

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య, వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినీలకు వన్‌కేర్ సైకిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీటీసీ సంగీత కుశాల్ హాజరై మాట్లాడుతూ.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలో మహిళలు అన్నీ రంగాలలో ముందుడాలని, అన్నీ చోట్ల మహిళల పట్ల జరగుతున్న దాడులను నియంత్రించేందుకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీఎచ్‌ఓ రేణుక, ఏఎన్ఎం పుష్పాలత, ఆశావర్కర్లు శాంత, కస్తూర్బాగాంధీ పాఠశాల టీచర్లు విద్యార్థినులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

సోమవారం 06 మార్చి 2023

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ లక్షెట్టి సాయిలు ఆదివారం భూమి పూజచేసి పనులను ప్రారంంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. గ్రామంలో వర్షకాలంలో నీరువచ్చి బురద ఎక్కువగా అయ్యే విధులను మొదటగా గుర్తించి, అక్కడే ఉపాధిహామీ రూ.5లక్షలతో పనులు ప్రారంభించామని, 15 రోజులలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గంగునాయక్, సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు మహమ్మదాబాద్ తాండా జాదవ్‌రాజు, రామన్న, నీలుపటేల్, దేశాయి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు కొర్రీలు

ఎకరానికి ఐదున్నర క్వింటాళ్లే కొనుగోలు చేస్తున్న వైనం

- దానికి మించి దిగుబడి వస్తే అంతే..
- ఆ కొనుగోళ్లకూ పడిగాపులు
- తూకం వేసిన బస్తాలు తరలించేందుకు డబ్బులు వసూలు చేస్తున్న డ్రైవర్లు
- ఆందోళనలో శనగ రైతులు

రైతులు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు.. శనగ పంట కొనుగోళ్లలో కొర్రీలు పెడుతున్నాయి. ఒక్కో ఎకరానికి సుమారు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే.. కేవలం ఐదు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పూర్తి పంటను కొనుగోలు చేయాలనే డిమాండ్ రైతుల నుంచి వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. జుక్కల్ మండలంలో శనగ కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. గన్నీ బ్యాగుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు తూకం వేసినవి లారీలో లోడింగ్ చేసి తరలించాలంటే లారీ డ్రైవర్లు సంచికి రూ.10 వసూలు చేస్తున్నారని.. డబ్బులు ఇవ్వకుంటే లోడింగ్ చేయనివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




పిట్లం : మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోళ్లు చేపడుతున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం/జుక్కల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది 85వేల ఎకరాలలో రైతులు శనగ పంటను సాగు చేయగా దిగుబడి అంతంతమాత్రమే వచ్చింది. కానీ ఈ సారీ మాత్రం రబీ సీజన్‌కు గానూ సుమారు 87 వేల ఎకరాలలో రైతులు శనగ పంటను సాగు చేశారు. కాగా దిగుబడి ఈయేడు 6లక్షల 96 వేల క్వింటాళ్లు వచ్చింది. అయితే ఈ పంటను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా శనగ పంటకు క్వింటాకు రూ.5335 మద్దతు ధర ప్రకటించింది. పంట కొనుగోలు నిమిత్తం మార్క్‌ఫెడ్‌ను ఎంపిక చేసి దీని ద్వారా 2లక్షల క్వింటాళ్ల శనగలు కొనుగోళ్లు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 26 సింగిల్ విండో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేపడుతున్నారు.

తక్కువ కొనుగోలు..

రైతులు రాత్రింబవళ్లు కష్టపడి ఒక ఎకరాకు సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల శనగ పంట దిగుబడి సాధించారు. అయితే ప్రభుత్వం ఎకరాకు ఐదున్నర క్వింటాళ్లలోపు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో ఐదున్నర క్వింటాళ్లకంటే అధిక దిగుబడి వచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే 5ఎకరాల వరకే కొనుగోలు కేంద్రాలకు తేవాలని నిర్దేశించింది. ఐదెకరాల కంటే ఎక్కువ శనగ పంట సాగుచేసిన రైతుల్లో సైతం ఆందోళన నెలకొంది. రైతులు పంటల సాగు భారం రోజురోజుకీ పెరిగినప్పటికీ పోటీపడి ఎకరాకు రూ.10 వేల నుంచి 12 వేల వరకు పెట్టుబడి పెట్టి దిగుబడి సాధించారు. అయితే ప్రభుత్వ కొర్రీలతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. ఇప్పటికైనా ప్రభుత్వం లేనిపోని కొర్రీలను నిలుపుదల చేసి పూర్తి పంటను కొనుగోలు చేసి, మద్దతు ధర పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



జుక్కల్ మండలంలో ఇదీ పరిస్థితీ..

మండలంలో ఫిబ్రవరి 27వ తేదీన సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే చేతుల మీదుగా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అట్టహసంగా కొనుగోలు కేంద్రాలను మండల కేంద్రంలోని విండో కార్యాలయం ఆవరణలో ప్రారంభిం చారు. మొదటగా గ్రామాలలోనే సహకార సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తామని అధికారికంగా వ్యవసాయ శాఖ ద్వారా ప్రకటించి కొనుగోలు తేదీలను ఖరారు చేశారు. ఇంతలోనే మూడు రోజులకే అంతర్గతంగా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి దళారుల కోరిక మేరకు కొనుగోలు కేంద్రాలను మండల కేంద్రంలో ఒకటి.. ఖండేబల్లూర్‌లో మరొకటి ఏర్పాటు చేశారు. గ్రామాలలో కొనుగోలు చేస్తే దళారుల ఆటలు సాగబోవని గ్రామాల్లో కాకుండా జుక్కల్, ఖండేబల్లూర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సౌకర్యాలు నిల్..

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలి. కానీ ఇవేవీ కల్పించడం లేదు. ఒక కొనుగోళ్లు నెమ్మదిగా సాగడంతో రైతులు రాత్రిపూట అక్కడే దోమల మధ్యలోనే పడుకుంటున్నారు.

డబ్బులు డిమాండ్..

లారీ డ్రైవర్లు తూకం వేసి శనగ బస్తాలను తరలించేందుకు సంచికి పది రూపాయలు డిమాండ్ చేస్తున్నారని.. లేకపోతే లోడింగ్ చేయనివ్వడం లేదని, సిబ్బంది కూడా కలిసి వేధింపులు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కొనుగోళ్ల నెమ్మదిపై సిబ్బందిని నవతెలంగాణ ప్రశ్నించగా.. గన్నీబ్యాగుల కొరత, బార్‌కోడ్ వేసేందుకు ఇబ్బందులున్నాయని చెబుతున్నారు.

డబ్బులివ్వొద్దు..

రైతులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వవద్దు. అడిగితే తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. వారిపై చర్యలు తీసుకుంటాం.

– జుక్కల్ విండో సీఈవో బాబురావు

పూర్తి శనగ పంటను కొనుగోలు చేపట్టాలి



నాకున్న రెండు ఎకరాలలో శనగ పంట సాగు చేయగా ఒక ఎకరాకు 10 కింటాళ్ల చొప్పున 20 క్వింటాళ్లు దిగుబడి వచ్చినప్పటికీ ప్రభుత్వం ఐదున్నర కింటళ్ల చొప్పున కొనుగోలు చేపట్టడం దారుణం. పండించిన పంట అమ్ముకోవడానికి ప్రభుత్వం సపోర్టు చేయడం లేదు. తక్కువ దిగుబడి వచ్చిన రైతుల ఖాతాలలో అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

– గైనికుమార్ రైతు, కంబాపూర్ గ్రామం, పిట్లం.

మిగిలిన పంటను ఏం చేసుకోవాలి



నాలుగు ఎకరాలలో శనగ పంట సాగు చేయగా ఒక ఎకరాకు 9 కింటల్లా చొప్పున దిగుబడి వచ్చింది. ఈ పంటను కొనుగోలు కేంద్రానికి తరలించగా అధికారులు ఒక ఎకరాకు ఐదున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేపడుతున్నారు. మిగిలిన పంటను ఏం చేసుకోవాలి ? మరెక్కడ విక్రయించాలి. ఎలాంటి షరతులు లేకుండా పూర్తి పంటను కొనుగోలు చేయాలి.

– అంజిరెడ్డి రైతు, గోధమేగావ్ గ్రామం, పిట్లం.

లోడింగ్ చేయడం లేదు



కొనుగోళ్లు మెల్లగా సాగుతున్నాయి. గన్నీ బ్యాగుల్లేవని, బార్ కోడ్ మిషన్ సరిగా పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. లారీలు రాకపోగా.. తూకం వేసిన వాటిని లారీలలో తరలించాలంటే సంచికి డ్రైవర్లు రూ.10 డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే లోడింగ్ చేయడం లేదు.


– శనగ రైతు జుక్కల్

వేధిస్తున్నారు..



వారం రోజులుగా రాత్రంతా పడిగాపులు కాసినా.. కొనుగోల్లు చేపట్టడం లేదు. రెండు రోజులు తూకం వేసి మిగతా రోజులు వివిధ కారణాలు చెప్పి కొనుగోలు చేయడం లేదు. కనీసం తాగు నీరు, నీడ సౌకర్యం లేదు.

– శనగ రైతు జుక్కల్



ప్రమాదకరంగా మలుపు


నిత్యం ప్రమాదాలు

- సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఫైర్ స్టేషన్ ప్రాంతంలో గల మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. మూలమలుపు వద్ద నుంచి నిత్యం లింగారెడ్డిపేట్, బీడీ కాలనీ, కళ్యాణి, రత్నపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ వాహనాల్లో ప్రయాణాలు చేస్తుంటారు. అయితే మూల మలుపు వద్ద క్రాసింగ్ ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని పట్టణవాసులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



వాహనాలపై వెళ్ళేటప్పుడు చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

-పేశెట్టి రవి, కల్యాణి గ్రామం.

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



కల్యాణి గ్రామానికి వెళ్ళడానికి డివైడర్ లేకపోవటంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో రావటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– మధు, కిరాణం షాపు యజమాని, ఎల్లారెడ్డి.

విరగబూసిన గోగు పువ్వు

- హెూలీ పండుగకు వాడే ప్రత్యేక పువ్వు


నవతెలంగాణ-ఎడపల్లి



గోగుపువ్వు పలు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో విరగబూసింది. ఈ పువ్వును ప్రధానంగా హోలీకి ప్రత్యేకంగా వాడు తుంటారు. అటవీ గుట్ట ప్రాంతాలలో మోదుగ చెట్టుకు గోవు పువ్వు విరగపూస్తుంటది. అయితే పురాతన కాలం నుంచి హోలీ పండుగకు ఈ పువ్వును తెచ్చి నీటిలో ఉడక బెట్టి రంగులాడుతుంటారు. దీని వినియోగం ఆనవాయితీగా వస్తోంది. కానీ రానురానూ గోగు పువ్వును వాడే నాథుడే కరవయ్యారు. గోగు స్వచ్ఛమైన ఆకుతో కూడిన పువ్వు. దీంతో రంగులాడిన ఎలాంటి హానీ ఉండదు. కానీ ప్రస్తుతం ప్రకృతి అందజేసే గోగుపువ్వును మరిచి ప్రజలు కెమికల్స్‌తో తయారుచేసే వివిధ రంగులను హోళీ పండుగకు వాడుతుండటం గమనార్హం.

పెద్దశక్కర్గ వాసికి జ్యోతిష రత్నాకర్ అవార్డు

నవతెలంగాణ-మద్నూర్



అవార్డు అందుకుంటున్న రామేశ్వర్‌స్వామి

సర్.సి.వి.రామన్ అకాడమీ (సేవా) సాంస్కృతిక సంస్థ, శ్రీకృష్ణ సేవా సంస్థాన్ సంయుక్తంగా సువర్ణ కంకణ అవార్డుల సంబ రాలను సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం ఉదయం నిర్వహించారు. కాగా మండలంలోని పెద్దశక్కర్గ గ్రామానికి చెందిన రామేశ్వర్ స్వామికి సువర్ణ కంకణంతోపాటు జ్యోతిష రత్నాకర్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రామేశ్వర్ స్వామి మాట్లాడుతూ.. ఈ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అవార్డులో ప్రదానంలో భాగంగా మూడున్నర అడుగుల షీల్డ్, ప్రశంసాపత్రము, పూలకిరీటమును అందజేసి, శాలువాతో సత్కరించినట్టు ఆయన తెలిపారు. విద్య, వైద్య, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, చారిత్రిక, లలిత కళల అంశాలను గుర్తించి ఈ అవార్డులు అందజేసినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో చలనచిత్ర దర్శకులు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'పిడి గుద్దులాట'కు జోరుగా ప్రాక్టీస్

- హూన్సాలో రేపే పిడిగుద్దులాట

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం హూన్స గ్రామంలో హెూలీ పండుగ సందర్భంగా నిర్వహించే పిడిగుద్దులాటకు గ్రామంలోని యువకులు, పెద్దలు గత నాలుగు రోజులుగా జోరుగా ప్రాక్టీసు నిర్వహిస్తున్నారు. సోమ వారం జరిగే కామదహనం అనంతరం మంగ ళవారం సాయంత్రం 5 గంటలకు ఈ పిడిగుద్దులాట కొనసాగనుంది. దాంతో ఇప్పటి నుంచే ప్రాక్టీసు చేయడంలో గ్రామ యువకులు నిమగ్నమయ్యారు.



రాత్రి వేళ గుద్దులాట కోసం ప్రాక్టీసు చేస్తున్న గ్రామస్తులు

పిడి 'గుద్దులాట'నే ఆనవాయితీ..

హెూలీ సందర్భంగా రంగులు చల్లుకొని, పూసుకోవడం సాంప్రదాయం కానీ.. ఈ గ్రామంలో మాత్రం రంగులు పూసుకోవడమే కాదు. ఆనవాయితీ ప్రకారం సాంప్రదాయంగా పిడి'గుద్దులాట'ను తరతరాల నుంచి గ్రామస్థుల కొనసాగిస్తున్నారు. గతంలో హెూలీ పండగ సందర్భంగా గ్రామంలో గతంలో మహారాష్ట్ర నాట్య కళాకారులచే కచేరీలు, నాటకాలు ప్రదర్శించడంతో జనం రద్దీ కనిపించేది. తమ బంధువులను ఆహ్వానించి రెండు రోజుల పాటు పండగ ఘనంగా నిర్వహించేవారు. కానీ రానురానూ మహారాష్ట్ర కళాకారుల నాటక ప్రదర్శనలు నిలిచిపోయాయి. దాంతో సందడి తగ్గినట్టయింది. పండగ సంద ర్భంగా గ్రామంలో జాతర రెండు రోజుల పాటు ఉంటుంది. గ్రామం నడిబొడ్డున నిర్వహించే ఈ పిడి గుద్దులాట గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. దాంతో మహారాష్ట్ర, కర్ణాటక, ప్రాంతాల నుంచి జనం ఈ ఆటను తిలకించేందుకు తరలివ చ్చేవారు. ప్రస్తుతం సమీప గ్రామాల ప్రజలు ఎప్పటిలాగే ఈ ఆటకోసం వస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

విద్యావంతులు ఆసక్తి చూపేనా..?

తరతరాల నుంచి సాంప్రదాయం పేరుతో ఒకరికొకరు కొట్టుకుంటూ ఆడే ఈ పిడిగుద్దులాట.. నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో గ్రామంలో గతంలో ఈ ఆటలో పాల్గొనే వారే పిడిగుద్దులాటలో తలపడుతున్నారని, కానీ విద్యావంతులు, ఉన్నత విద్యను అభ్యసించే యువకులు ఈ ఆటకు దూరం ఉంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దాంతో ఈ ఆట పాత తరం వారితోనే కొనసాగుతుందని, యువకుల ఆసక్తిని బట్టి భవిష్యత్తులో ఈ ఆట మనుగడ ఆధారపడి ఉందని మరికొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి పేరు ప్రఖ్యాతులు సాధించిన ఈ పిడిగుద్దులాటను వదలమని, ప్రతి సంవత్సరంలాగే ఈ పిడిగుద్దులాటలో తాము పాల్గొంటామని కొంతమంది యువకులు పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు ఉన్న దర్జాగా కొట్టుకోవడం అనేది హూన్స గ్రామస్తులకే సాధ్యం.

దళితులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం

- డీహెచ్‌పీయస్ బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు కాదేపురం గంగారాం

నవతెలంగాణ-బిచ్కుంద

దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం ముందుండి పోరాటాలు చేస్తామని, దళితులకు ఎలాంటి సమస్య వచ్చినా వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉండి ఆదుకుంటామని దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ అధ్యక్షులు కాదేపురం గంగారాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో దళిత హక్కుల పోరాట సమితి మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ.. దళితుల కోసం అనేక సంఘాలు ఉన్నాయని, కానీ ఏ సంఘం కూడా దళితులకు న్యాయం జరిగే విధంగా పనిచేయడం లేదని, దళితులు అణచివేతకు గురవుతున్నారని దళితులకు క్షేత్ర స్థాయిలో అన్యాయం జరిగితే ఎవరు కూడా స్పందించకపోవడంతోనే దళిత హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు సమావేశాలు ఏర్పాటు చేసి ఈ సమావేశాల్లో సమస్యలు తెలుసుకుంటూ దళితులకు న్యాయం జరిగే విధంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అయ్యాల సంతోష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుడుగొల్ల రమేష్, ప్రచార కార్యదర్శి బేగరి సాయిలు, ప్రధాన కార్యదర్శి గైని ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు బేగరి దత్తు, ఎర్రోళ్ల అశోక్, నాయకులు నక్కేవార్ మారుతీ, మీరేవార్ సాయిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగారాం

వంటగ్యాస్ ధరకు అదుపు లేదు.. మోడీ సర్కార్‌కు బుద్ధి లేదు

- గ్యాస్ ధరపెంపుపై గోవూర్‌లో రాస్తారోకో



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని

వంటగ్యాస్ ధరకు అదుపు లేదు.. మోడీ సర్కార్‌కు బుద్ధి లేదని ప్రజలు విమర్శించారు. మోస్రా మండలంలోని గోవూర్ గ్రామస్తులు మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచినందుకు నిరసనగా నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం రోజురోజుకు పెంచుతున్న వంట గ్యాస్‌ల ధరలతో సామాన్య ప్రజలపై అధిక భారం పడుతుందని మండిపడ్డారు. మోడీ సర్కార్ పాలన సామాన్య ప్రజలపై కక్షపూరిత పాలనగా ఉందని పేర్కొన్నారు. రూ.500 ఉన్న వంటగ్యాస్ ధర ఇప్పుడు రూ.1200 కావటం ప్రజలపై అధిక భారం అవుతుందని మోడీ సర్కార్‌కు సిగ్గుచేటని అన్నారు. వెంటనే మోడీ సర్కార్ వంట గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలను కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే దినాలలో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నన్నేసాబ్, సత్యనారాయణ, మగబుల్, వార్డ్‌మెంబర్ మైముద్, గ్రామస్తులు బుజ్జి, ఆసియా అహమది, గోరి తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంలోనే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని ఇవి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు, మంత్రులు బీజేపీపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మేడపాటి ప్రకాష్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ వర్క్‌షాప్ కార్యక్రమానికి హాజరై అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, నరసింహరెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివ ప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ట్రీ కటింగ్స్, ఇన్సులేటర్స్ రీప్లేస్మెంట్, జంపర్స్ రీప్లేస్మెంట్ వంటి కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల 30 నిమిషాల నుండి 9 గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ తోట రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డి2 సెక్షన్ పరిధిలో ఖలీల్ వాడి, వీక్లీ మార్కెట్, బొబ్బిలి వీధి, కసాబ్ గల్లి, పూసల గల్లి, రాజీవ్ గాంధీ ఆడిటోరియం, డి3 సెక్షన్ పరిధిలో మహాలక్ష్మి టెంపుల్, అంబేద్కర్ నగర్, ప్రభత్ టాకీస్ ఏరియా, సంజీవయ్య కాలనీ, డి9 పరిధిలో సుభాష్ నగర్, ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీ, పాముల బస్తి, మీసేవ, డి5 సెక్షన్ పరిధిలో గూపన్‌పల్లి విలేజ్, గంగస్థాన్ ఫేస్-2,3, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

108 వాహనంలో కవలలకు జన్మనిచ్చిన తల్లి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



108 వాహనంలో ఓతల్లి కవలకు జన్మనిచ్చింది. మండలకేంద్రానికి చెందిన వెంకట ధనలక్ష్మి కి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సమయానికి 108అంబులెన్స్ వచ్చి నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఇద్దరు ఆడ శిశువులకు జన్మనిచ్చింది. వెంకట ధనలక్ష్మి చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పిల్లలు తల్లి క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

మనిషిని చూస్తే బొమ్మ గీస్తాడు

- క్యాన్వాస్ పెయింగింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ
- దేశ విదేశాల్లో ప్రసిద్ధి
- ఇంట్లో వేసుకునేందుకు ఆసక్తి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇప్పుడు ప్రతి ఒకరు ఇంటిపై ఎంతో శ్రద్ధతో వారి అభిరుచికి తగినట్టుగా నిర్మించుకుంటున్నారు. దానికి తోడు ఇంటికి అనువైన రంగులను అద్భుత సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇంటి గోడలు అందంగా కనిపించేందుకు రంగురంగుల, రకరకాల డిజైన్లతో ముస్తాబు చేసుకుంటున్నారు. ఎన్నో లక్షలు వెచ్చించి ఇంటిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగానే ఇంటిలో ఉన్నంత సమయంలో ప్రశాంతత కోసం సుందరమైన డిజైన్లను, క్యాన్వాస్ ఆర్ట్ పెయింటింగ్‌లను ఇంట్లో వేయించుకుంటున్నారు. పెయింట్లు ఎంత కాలమైనా చెక్కుచెదరకుండా, నీటితో కడిగినా అప్పుడే వేసినట్టుగా కనబడుతుంది. అందుకే ఇంటి నిర్మాణం చేసుకున్నవారు క్యాన్వాస్ పెయింట్ పైన ప్రత్యేక శ్రద్ధను చూయించి ఆదరిస్తున్నారు. క్యాన్వాస్ పెయింట్లకు బెంగళూరు, చెన్నై, కలకత్తా, ముంబై వంటి పట్టణాల్లోనే కాకుండా ప్యారిస్, అబుదాబి, దుబాయ్ వంటి దేశాలలో కూడా ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఎంతో మంది దీనిపైన అభిరుచి కలవారు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఇంట్లో వేయించుకుంటున్నారు. క్యాన్వాస్ పెయింట్లకు వేల నుండి లక్షల వరకు ధర పలకడంతో వాటిని అంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేస్తారు. నేడు క్యాన్వాస్ పెయింట్లకు ఎంతో ఆదరణ పెరుగుతోంది, వాటిని పెయింట్ చేసిన అనంతరం ఆన్లైన్లో కూడా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి క్యాన్వాస్ పెయింట్లు ఎంతో పెద్ద కంపెనీలు ఆర్టిస్టుల దగ్గర కొనుగోలు చేసి, పెద్ద ఎగ్జిబిషన్ కం సేల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేయడం చేస్తుంటారు. వీటికి అంతగా ప్రాముఖ్యత ఉంది.



నర్సింగ్ వేసిన పెయింటింగ్

ముంబైలో నీతు అంబానీ వారు కూడా ఈ పెయింట్లను పెద్ద గ్యాలరీ ఎగ్జిబిషన్ షో కం సేల్ ఏర్పాటు చేసి క్యాన్వాస్ పెయింట్ లను అమ్ముతూ ఉంటారు. ఇంతటి ప్రఖ్యాతిగాంచిన క్యాన్వాస్ పెయింట్లు మన నిజామాబాద్ నగరానికి చెందిన బిల్ల నర్సింగ్‌రావు వేసి అందరి ఆదరాభిమానాలను పొందుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు.



బిల్ల నర్సింగ్ రావు వేసిన పెయింగ్స్‌తో...

చిన్నతనంనుండే అలవాటు..

ఇంతటి కళాకరునిగా ప్రసిద్ధి చెందడానికి ఆయన చిన్నతనం నుండే గోడలపైన బొగ్గుతో వెయ్యడంతో అది అలవాటుగా మారింది. అదే ఆయనకు జీవనోపాధి అయింది. అనంతరం ఆయన హైదరాబాద్‌లోని లుంబీని పార్కు ముందు కూర్చొని మనిషిని చూస్తూ పేపర్ పైన పెన్సిల్‌తో బొమ్మ గీసేవారు. ప్రతి రోజు పార్కు ముందు కూర్చొని వేసిన పెయింట్‌లకు కనీస కూలీ కూడా పడేది కాదు. దీంతో కుటుంబ పోషణ ఎలా అనే సందేహం కలిగింది. కుటుంబ పోషణ ఏ విధంగా చేయాలనే ఆలోచనతోనే పుట్టిన నూతన ఆలోచన, అదే ఆతరువాత క్షణం నుంచే క్యాన్వాస్ పేయింట్ల వేయడం ప్రారంభించారు. అదే నేడు కుటుంబ పోషణగా మారింది. ఇటువంటి కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటే కళలు సజీవంగానే మిగిలి ఉంటాయి, ఇతరులకు ఇటువంటి కళాకారుల సహకారంతోపాటు జీవనోపాధి లభిస్తుంది.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ దశరథ్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.40లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సునంద ప్రభాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు గర్గుల రాజాగౌడ్, ఉప సర్పంచ్ బాలయ్య, టీఆర్ఎస్ మండల నాయకులు రామడుగు హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన టీడీపీని అక్కున చేర్చుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అభివృద్ధి చేసిన టీడీపీని అక్కున చేర్చుకోవాలని దేగాం యాదాగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌కు రాష్ట్రపార్టీ అబ్జార్వర్‌గా నియమితులైన పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డికి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూనానని తెలిపారు. పోలీస్ పటేల్, పట్వారి, దొరల గడీల నుండి, వెట్టిచాకిరిలు చేయిస్తూ కనీస విద్యకు, వైద్యానికి దూరంగా ఉండి గ్రామాలకు ఎర్ర బస్సు రాని పరిస్థితులు, కరంట్ లేని గ్రామాలూ, రోడ్లు లేని పరిస్థితులను చూసి తెలుగు ప్రజలకు ప్రపంచం నలు మూలల్లో గుర్తింపు తెచ్చే విధంగా అభివృద్ధి చేసిన ఘనత నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడుదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వేసినబాటలే నేటి అభివృద్ధి అని తెలిపారు. ఈవిషయాలను ఇంటింటికి, తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడడమే ధ్యేయమని తెలిపారు.

నా భర్తతో ప్రాణహాని ఉంది

జమాల్పూర్ రజిని

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న రజిని

నా భర్తతో ప్రాణహాని ఉందని జమాల్పూర్ రజిని అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని వారికి భర్త సహకారం ఉండాలని గతనెల 22న కుల పెద్దలకు ఆరే కటిక సంఘం లో ఫిర్యాదు చేసిన సందర్భంగా కులపెద్దలు ఇద్దరు పిల్లల పేరుతో ఐదు లక్షల డిపాజిట్ చేయాలని తీర్మానించారని అన్నారు. 2015 లో తన భర్త దుబాయ్ వెళ్లి నెలరోజులు కూడా అక్కడ పని చేయకుండా తిరిగి వచ్చాడని, ఇక్కడ తప్పతాగి తిరుగుతున్నాడని ఆమె తెలిపారు. సొంతింటిని రూ. 16లక్షల50వేలకు అమ్మివేశాడని అన్నారు. వచ్చిన డబ్బును వృధా ఖర్చు చేశాడని, అందులో మిగిలి ఉన్న ఐదు లక్షలైనా పిల్లల పేరుతో ఫిక్స్ డిపాజిట్ చేసి న్యాయం చేయాలని కోరారు. తనకు, పిల్లలకు అన్యాయం చేయాలని చూస్తున్నాడని, తప్ప తాగి వచ్చి తనను, పిల్లల్ని చంపేస్తానని బెదిరిస్తున్నాడని అన్నారు.

అధిక యూరియా వాడితే వరికి అగ్గితెగులు సోకే అవకాశం ఎక్కువ

భీంగల్ ఏడీఏ కంపాటి మల్లయ్య

నవతెలంగాణ-ఏర్గట్ల



పీఏసీఎస్‌కు వచ్చిన యూరియా

రైతులు వరి పంటకు అధికంగా యూరియా వాడితే అగ్గితెగులు సోకే ప్రమాదం ఉందని భీంగల్ ఏడీఏ కంపాటి మల్లయ్య అన్నారు. ఆదివారం ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ సొసైటీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవసరం మేరకే యూరియా వాడాలని తెలిపారు. ఏర్గట్ల పీఏసీఎస్‌లో ఇరవై టన్నుల యూరియా, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో ఇరవై టన్నుల యూరియా మార్క్‌ఫెడ్ నుండి సరఫరా అయ్యిందని, మండలంలో మొత్తం 40 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు ఎంత యూరియా అవసరం ఉంటే అంతే తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని, యూరియా, పొటాష్, ఎరువులు కలిపి చల్లడం వల్ల గింజ గట్టిపడి నాణ్యమైన దిగుబడులను రైతులు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏర్గట్ల,తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి,సొసైటీ కార్యదర్శులు శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన అంగళ రమేష్ కుటుంబానికి గ్రామానికి చెందిన ఎన్నారైలు ఆర్థిక సహాయం అందజేశారు. అంగళ రమేష్ రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు కొంతమంది 76 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా పంపించారు. ఆ మొత్తాన్ని రమేష్ భార్య లావణ్యకు రూ.50 వేలు, రమేష్ తల్లి నర్సుబాయికి రూ.26వేలు అందజేశారు. సహాయం అందించిన యూఏఈ ఎన్నారైలకు సర్పంచ్ సక్కారం అశోక్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, ముఖేష్, ఇప్ప రమేష్, పోలీస్ రాజు, బి.మహేష్, తోట అప్పయ్య, ఎస్. గోవర్ధన్, ఎన్. రమేష్, ఎస్. నారాయణ, బిఎస్ మోహన్, ఎం. అశోక్, రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్పీఎస్సీ ఏఈ పరీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా టీఎస్పీఎస్సీ ఏఈ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది సెంటర్లలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించారు. ఉదయం 3170 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2542 మంది పరీక్ష రాసారని, 628 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3170 మంది పరీక్ష రాయలసీ ఉండగా 2537 మంది పరీక్ష రాయగా 633 మంది గైర్హాజరైనట్లు అధికారులు చెప్పారు.

ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

దళిత మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఏర్గట్ల గంగ ప్రసాద్ మామ రోడ్డు ప్రమాదంలో ఇటీవల తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో ఆదివారం బీజేపీ నియోజకవర్గ నాయకులు ప్రొద్దుటూరు వినయ్ రెడ్డి పట్టణంలోని ఆశ హాస్పిటల్ వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కష్ట సమయాల్లో ఆదుకునేందుకు ముందుంటానని వినయ్‌రెడ్డి అన్నారు.

సీఈటీ, టీజీయూజీ సెట్ ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మండలంలోని దర్మారం(బీ) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సిఓఈ)లో ఆదివారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో సిఈటి-2023 ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకోసం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 448 మంది విద్యార్థులకు 427 మంది హాజరవ్వ గా 21 మంది హాజరు కాలేదని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, ధర్మారం (బి) ప్రిన్సిపాల్. బి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం. 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు టీజీయూజీ సెట్ - 2023 కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ లో అడ్మిషన్లకు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు గాను మొత్తం 452 మంది విద్యార్థులకు 426 మంది హాజరవ్వగా 26 మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ చెప్పారు.

రెండు పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని తెలిపారు. ధర్మారం (బి) పరీక్ష కేంద్రం లో పరీక్ష సజావుగా నిర్వహించడాని నిజామాబాద్ రిజియన్ అర్ సి ఓ టి. నళిని పెద్దకొడప్‌గల్ ప్రిన్సిపాల్‌ను డిపార్ట్మెంటల్ అధికారిణి గా నియమించినట్టు తెలిపారు. అర్ సి ఓ నళిని ఈ పరీక్ష కేంద్రానికి సందర్శించి పరిశీలించారు.

కులవృత్తుల సంక్షేమానికి ప్రభుత్వం నిర్విరామ కృషి

ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

కులవృత్తుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి, మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కుల వృత్తుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్క కుల సంఘ భవనాలను ఏర్పాటు చేస్తూ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబి రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, పూజ నరేందర్, సుంకరి రంగన్న, రాజా గంగారాం, జిల్లా యూత్ సీనియర్ నాయకులు మల్యాల నర్సారెడ్డి, కౌన్సిలర్లు కవిత కాశీరాం, రవి గౌడ్, ఆకుల రాము, చాలా ప్రసాద్, విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ విశాల్, శివకుమార్ సభ్యులు గోవర్ధన్, మోహన్, ప్రణీత్, చిన్నారెడ్డి, చిన్న గంగారం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డుకు ఎంపికైన రూపా సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డు 2023 కు గాను మండలంలోని సుద్ద పల్లి సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి ఎంపికైనట్లు జాతీయ అవార్డు బహుజన సాహిత్య అకాడమి కమిటి వారు ప్రకటించారు. అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్ బీఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బీసీ. మైనారిటీ సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మార్చి 12 న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డును అందజేయమన్నట్లు అయన వివరించారు. సౌత్ ఇండియాలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, పదుచ్చేది రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరవుతారని అయన వివరించారు. అవార్డు ప్రకటించడం పట్ల సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ అవార్డు మరింత బాధ్యత పేంచిందని పేర్కొన్నారు.

ఇందూరు అపురూప అవార్డు అందుకున్న చిన్ని కృష్ణుడు



అపురూప అవార్డు అందుకున్న చిన్నికృష్ణుడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఇందూరు అపురూప అవార్డు-2022ను ఆదివారం అందుకున్నట్టు చిన్ని కృష్ణుడు తెలిపారు. మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన నాగుల చిన్న గంగారం అలియాస్ చిన్ని కృష్ణుడు వ్యవసాయ రంగంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఇటీవల పొలంలో అమ్మానాన్న ఫొటో చిత్రీకరించారు. మాక్లూర్ మండలంలోని మామిడిపల్లి ఎక్స్ రోడ్ వద్ద శ్రీవారి అపురూప కల్యాణ మండపంలో అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు 2022, 2023 లో భాగంగా జక్రాన్‌పల్లి మండలం చింతలూరు గ్రామానికి చెందిన నాగులచిన గంగారాంకు వ్యవసాయ రంగంలో గుర్తించి ఇందూరు అపురూప అవార్డు అందజేశారు.

ఉత్తమ సామాజిక రచయిత విశిష్ట పురస్కారం అందుకున్న అంకం నరేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



పురస్కారం అందుకుంటున్న నరేష్

మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అంకం నరేష్‌కు ఉత్తమ సామాజిక రచయిత విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. సామాజిక సమస్యలపై వివిధ పత్రికల్లో వ్యాసాలను రాయడంతో గుర్తించి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రచయితల వేదిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సామాజిక రచయితల రాష్ట్ర విశిష్ట పురస్కారాలలో భాగంగా ప్రముఖ కవి సినీ దర్శకులు వడ్డేపల్లి కృష్ణ చేతుల మీదుగా అంకం నరేష్ అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి రచయితలు, కవులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి

ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చిన డాక్టర్ను సంప్రదించాలి

ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ సుభాష్ సూచన

నవతెలంగాణ-కంఠేశ్వర్



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా డాక్టర్ ను సంప్రదించాలని ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి సుభాష్ సూచించారు. ఆరోగ్యం విషయంలో చేసే అజాగ్రత్త కొన్ని సార్లు ప్రాణాల మీదికి తెస్తుందని అన్నారు. శాలిని హార్ట్ హాస్పిటల్, గౌతమి మహిళా వినియోగదారుల సంఘం, జిల్లా పద్మశాలి మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, చెవి, ముక్కు, గొంతు, క్యాన్సర్, ఎముకలు, చర్మవ్యాధుల వైద్యులు కూరపాటి కళ్యాణ్, సుభాష్, కార్తీక్, గుజ్జేటి నవీన్, సి.శ్యాంసుందర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్, బోన్ మినరల్ డెన్సిటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సుభాష్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అందరికీ అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తూతూ మంత్రంగా కాకుండా ఈ శిబిరాల్లో పకడ్బందీగా నిష్ణాతులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి అనారోగ్య లక్షణాలు ఉన్నవారికి మెరుగైన వైద్యం అందేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి మాట్లాడుతూ వైద్య శిబిరంలో నాలుగు వందల మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.యాదగిరి,పుల్గం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, నగర సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చంద్రభాగ, కార్యదర్శి అమరవిక, పద్మశాలి పాఠశాల అధ్యక్షులు చేర్యాల విష్ణు, పద్మశాలి సంఘం బాధ్యులు గురుచరణ్, సిలివేరి గణేష్, చింతల గంగాదాస్, గంగాచరణ్, తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘ కల్యాణ మండపానికి విరాళం

నవతెలంగాణ-ఆర్మూర్



విరాళం అందజేస్తున్న అలూర్ కురుమ సంఘం సభ్యులు

నూతనంగా నిర్మించబోయే కురుమ సంఘం కల్యాణ మండపానికి ఆలూర్ మండల కురుమ సంఘ సభ్యులు విరాళం అందజేసి సేవ భావాన్ని చాటుకున్నారు. నందిపేట్ మండలంలో కురుమ సంఘం కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. దీనికి ఆలూర్ మండలం లోని కురుమ చిన్న తరుప సంఘం సభ్యులు ఆదివారం సుమారు 40 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం ప్రధానకార్యదర్శి దేవన్న, ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు కేజీ సురేష్, నందిపేట్ మండల అధ్యక్షులు భోజన్న, నందిపేట్ యూత్ అధ్యక్షులు రాజశేఖర్, యూత్ నాయకులు సతీష్, సొసైటీ కుర్మె రాజు, ఆలూరు కురుమ సంఘము నాయకులు. మల్లేష్, రాములు, అజయ్ ఉన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
3
సోమవారం 06 మార్చి 2023

మనోహరాబాద్‌లో షూటింగ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలో మనోహరాబాద్‌లో పల్లెటూరి వాతావరణం షూటింగ్ నిర్వహించినట్టు మనోహరాబాద్ మాజీసర్పంచ్ తిరుపతిరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్వ సంస్కృతి కనమరుగవుతుందనే ఉద్దేశంతో పాట రచయిత పరుశురాం పల్లె వాతావరణానికి సంబంధించి రాశారని తెలిపారు. దీనికి కెమెరామెన్. డైరెక్టర్ సంతోష్ చిత్రీకరించారు. ముఖ్య పాత్రలో పాటుకూరి తిరుపతిరెడ్డి, కుమారి దీప్తి, మనోహరాబాద్ గ్రామస్తులు షూటింగ్‌లో పాల్గొన్నారు.

సాలూరలో కామ దహనం

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రంలో ఆదివారం కామ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో సాంప్రదాయంగా గ్రామ పోలీసు పటేల్ అయిన వెంకట్ పటేల్ కుల సంఘాలను ఆహ్వానించిన అనంతరం కామునికి ప్రత్యేక పూజలు నిర్వహించి కామ దహనం చేపట్టారు. కార్యక్రమంలో కులసంఘాల పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

దొంగల బీభత్సం

- వ్యక్తికి గాయాలు
- పలుచోట్ల చోరీకి యత్నం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ బర్కత్‌పుర కాలనీలో శనివారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లో చొరబడి బీభత్సం సృష్టించారు. మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో బైకు చోరీ యత్నం విఫలం కాగా అక్కడి నుంచి పెర్కిట్‌లోని ఓ ఇంట్లో చొరబడి అబ్దుల్ నహీం అనే వ్యక్తిపై దాడి చేశారు. చేతికి తీవ్ర గాయాలయ్యాయి. 101కు సమాచారం ఇవ్వగా ఇద్దరు దొంగలు పారిపోగా ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మామిడిపల్లి సరస్వతి నగర్‌లోనైతం ఆటోను ఎత్తుకెళ్లారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ను ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో ఆర్టీసీ కాలనీ

- ఇండ్ల చుట్టూ మురికి కాలువలు కుంటలు
- కాలనీలో అంతా ఉద్యోగస్తులే
- ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

రోజు ఉదయం లేవగానే హడావిడిగా తయారై ఉద్యోగానికి వెళ్లడం ఆ కాలనీవాసుల దినచర్య. కాలనీ ఏర్పడి ఏండ్లు గడుస్తున్న మురికి కాలువలు, రోడ్లు లేవు. దీంతో మురికినీరంతా చేరి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో దోమలు పెరిగి అనారోగ్యాల బారిన పడుతున్నారు.

మండలంలోని మాణిక్ బండార్ గ్రామ శివారులో గల ఆర్టీసీ కాలనీలోని 4,5,6, రోడ్లు మున్సిపాలిటీలోని మూడోవ డివిజన్‌లోకి చేరాయి. నగర మున్సిపాలిటీలో ఉన్న ఆ కాలనీ వైపు ప్రజాప్రతినిధులు గాని అధికారులు గానీ కన్నెత్తి చూడడం లేదు. ఇక్కడ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై ఖాళీ స్థలాల్లో చేరి కుంటలు, చెరువులను తలపిస్తున్నాయి. ఇండ్ల చుట్టూ మురికి కాలువలు ఉండడం వల్ల దోమలు చేరి అనారోగ్యాల పాలవుతున్నారు. కాలనీలో దోమల నివారణ కోసం పాగింగ్ చేయడం గాని మురికి కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని స్థానికులు తెలుపుతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

కాలనీవాసులు తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేదని అంటున్నారు. మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ స్పందించిన దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.





ఇండ్ల చుట్టూ చేరిన మురుగునీరు

ప్రజారోగ్యాలు కాపాడండి

కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేందర్.



డ్రయినేజీలు ఏర్పాటుచేసిన కాలనీవాసులు ఆరోగ్యాలు కాపాడాలి. ఆర్టీసీ కాలనీలోని 4, 5, 6 నెంబర్ గల రోడ్లకు ఇరువైపులా సీసీ డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేసి మురికి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని ముదక్ పల్లి గ్రామంలో ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కందుకూరి నర్సయ్య (48) వ్యవసాయం చేసుకునేవాడు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేక కుటుంబ సభ్యులు ఎన్ని హాస్పిటల్ తింపినా కూడా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో జీవితం పై విరక్తి చెంది ముదక్‌పల్లి గ్రామంలోని పెద్దవాగుకు అనుకుని ఉన్న టేకు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కందూరి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-సిరికొండ

కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మండలంలోని చిన్నవాల్గొట్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏస్సై నరసింహులు వివరాల ప్రకారం.. బొబ్బిలి సతీష్ (27) తన పొలంలో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సదరు యువకునికి భార్య కూతురు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన అంబటి చిన్నసాయిలు అనే వ్యక్తి (48) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్టు ఎడపల్లి ఎస్ఐ పాండేరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అంబటి చిన్న సాయిలు భార్య గత నాలుగు నెలల క్రితం చనిపోయింది. ఈనెల 3న సాయంత్రం 4 గంటల సమయంలో ఎడపల్లి పరిధిలోగల కాలువలో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. మృతుని అన్న అంబాటి నడిపి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమడుగులో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నల్లమడుగు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు ఎస్ఐ శంకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం నల్లమడుగు వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గ్యార బసవయ్య అనే వ్యక్తి జూనియర్ లైన్‌మెన్ అయిన కాటం రాజేష్‌కి ఫోన్ చేసి గ్రామానికి నీటి సరఫరా చేసే మోటర్ నడవడం లేదని చెప్పగా.. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడమని తెలుపగా అక్కడికి వెళ్లి చూసేసరికి ట్రాన్సార్మర్ కిందపడి ఉంది. దీంతో లైన్‌మెన్ అక్కడికి వెళ్లి చూసేసరికి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడవేసి అందులో ఉన్న 40 కేజీ కాపర్ వైన్డింగ్, 50 లీటర్ల ఆయిల్‌ను దొంగిలించి ఉంది. లైన్‌మెన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధ దంపతులకు గాయాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం పెంటాఖుర్దు క్యాంప్ గ్రామానికి చెందిన దర్జీ హనుమండ్లు తన భార్య లక్ష్మితో కలిసి గ్రామం సమీపంలో చెరువు కట్టపై గల వీరభద్ర ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం ఉండడంతో తన మోపెడ్‌పై వెళుతున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో పెంటఖుర్దు గ్రామానికి చెందిన మోస్రా సాయిలు అనే వ్యక్తి వారి మోపెడ్‌ను ఢీకొట్టాడు. దీంతో తమను ఎందుకు ఢీకొట్టావని బాధితుడు ప్రశ్నించగా నేను విలేకరిని నన్నే ప్రశ్నిస్తావా.. నీ అంతు చూస్తానంటూ బెదిరించి వెళ్లిపోయినట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు స్వల్ప గాయాలు కాగా, తన భార్య లక్ష్మికి కుడి మోచేయికి బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి వెళ్ళినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడిపి తమను ఢీకొట్టిన మోస్రా సాయిలుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితులు బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

బొలెరో వాహనం, బైకు ఢీ..

- ఒకరికి గాయాలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం రాత్రి అతి వేగంగా వస్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి బైక్ ను ఢీకొనడంతో బైక్ నడిపిస్తున్న హస్గుల్ గ్రామానికి చెందిన షకీర్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన షకీర్‌ను హుటాహుటిన నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బొలెరో వాహనం నడిపిస్తున్న డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని గాయపడిన షకీర్ పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

యాదగిరి ఆశయ సాధనకు కృషి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కామ్రేడ్ కోడూరు.యాదగిరి ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ ఫిట్టర్స్ యూనియన్ కార్యాలయంలో యాదగిరి సంతాప సభ అనిల్ అధ్యక్షతన నిర్వహించారు. పి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. యాదగిరి రైస్ మిల్ యజమానుల వల్ల ఇబ్బంది అవుతున్న ఫిట్టర్స్‌ను చైతన్యపరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కారం చేశారని తెలిపారు. పసుపు డోలు, రైస్ మిల్లల్లో పనిచేసే పాంతి లేబర్ మహిళలకు సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. సివిల్ సప్లై హమాలీ, ఇతర రంగాల హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. సంతాపసభలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.భూమయ్య, సిపిఐ జిల్లా నాయకులు ఏ.రాజేశ్వర్, ఎండీ.రఫీక్ ఖాన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.నర్సింగ్ రావు, ఫిట్టర్స్ యూనియన్ నాయకులు రమేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పి.హనుమాన్లు, భాను, టిడిపి నాయకులు కోయేడి. నర్సింలు, పిట్టర్ యూనియన్ నాయకులు సాయిలు, తిరుపతిరెడ్డి, జాఫర్, శివకుమార్, ప్రసాద్, లాయక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానమే

- ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్ట్ సీడీపీఓ జానకి

నవతెలంగాణ-ఎడపల్లి



మహి ళలు పురుషులతో సమానమేనని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని జానకి అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జానకి మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో పురుషులతో పాటు సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులను స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు వినోద, సర్పంచ్ అమాన్నుల్ల షరీఫ్, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర ఏఎన్ఎం స్వప్న, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు హేమమాలిని, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

నవతెలంగాణ-మద్నూర్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్ మండలం బోరంచ గ్రామంలో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమంతు షిండే ఆదివారం నల్ల పోచమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు ఆలయాన్ని సందర్శించి మొక్కును తీర్చుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకరు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పద్మశాలి సంఘం అధ్యక్షులు కటకం నరేందర్ అన్నారు .పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలోని ఆదివారం పద్మశాలి సంఘం ఐదవ తర్పలో కామదహనం కార్యక్రమంలో భాగంగా పర్యావరణ కాపాడాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి టిఫిన్ బాక్స్‌లు అందజేశారు. 180మంది సంఘ సభ్యులకు ఉచితంగా గుడాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారించి పర్యావరణ పరిరక్షణకు స్టీల్ బాక్సులు, వస్త్ర బ్యాగులు వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బోగ గంగాధర్ , కోశాధికారి పురుషోత్తం, కార్యవర్గ సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, కొండ గంగాధర్, లక్ష్మణ్, సత్యనారాయణ, రాజేశ్, గ్యాంటల గణేష్, రఘు, శ్రావణ్, పట్వారీ తులసి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం (బి)లో పూర్వ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని దర్మారం (బీ) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదవతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.

అన్ని వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

తెలంగాణ రాష్ట్రంలో వివిధ వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిపల్లి, మాణిక్ బండర్, మాక్లూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మామిడిపల్లి గ్రామంలోని సిసి రోడ్లకు, మాణిక్ బండర్ గ్రామ శివారులో మండల మున్నూరు కాపు, కళ్యాణ మండపం రూ. 50 లక్షలతో, మాక్లూర్ గ్రామంలోని మైనార్టీ షాదీఖాన రూ. 50 లక్షలతో నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మాక్లూర్ లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మించిన శ్మశాన వాటికను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, నిజామాబాద్ 2వ డివిజన్ కార్పోరేటర్ రాయసింగ్, సర్పంచ్ మల్లారెడ్డి, అశోక్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గోపు లక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవో క్రాంతి, ఆర్ఐ షఫీ, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోటీలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేముల సురేందర్ రెడ్డి స్మారక ఆర్మూర్ డివిజన్, ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడా పోటీలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అంతకుముందు వేముల సురేందర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, యువజన సంఘం నాయకులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు..

10న ఫాసిజం - ప్రమాదంలో భారతదేశంపై సదస్సు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నినాదాలు చేస్తున్న నాయకులు

'ఫాసిజం - ప్రమాదంలో భారతదేశం' సదస్సును జయప్రదం చేయండి అని సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. భారత విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 7వ వర్ధంతి సందర్భంగా ఫాసిజం-ప్రమాదంలో భారతదేశం అంశంపై ఈనెల 10న హైదరాబాదులో జరిగే సదస్సు పోస్టర్లను పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ దేశంలో ఒక పక్క నిరుద్యోగం, పేదరికం, అసమానతలతోపాటు, సకల రంగాలలో సంక్షోభాలు ఎదురవుతున్నాయన్నారు. మరోపక్క మత ఉన్మాదం, మత విద్వేషం కట్టలు తెంచుకుని ప్రజల మీద స్వైర విహారం చేస్తుందన్నారు. ప్రగతి నిరోధక, సంకుచిత భావజాలం మనుషులను ఉన్మాదులుగా మార్చుతుందన్నారు. తిండి మీద, కట్టుబాట్ల మీద, స్వేచ్ఛా హక్కుల మీద, భావ ప్రకటనల మీద ఆంక్షలు, నిషేదాజ్ఞలను విధిస్తున్నదన్నారు. రాజ్యాంగాన్నే ధ్వంసంచేసి, మనువాద రాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ స్థితిలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రతీ ప్రజాస్వామికవాది, లౌకికవాది, కమ్యూనిస్టుల కర్తవ్యం కావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు విటల్, కిరణ్, పి.డి.ఎస్.యు నగర ఉపాధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

మహిళలపై ఫాసిస్ట్ మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం

- పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

నవతెలంగాణ-సిరికొండ

మహిళలపై కేంద్ర ప్రభుత్వం మనువాద దాడికి వ్యతిరేకంగా మహిళలంతా పోరాడాలని, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వి గోదావరి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా సిరికొండ మండలం గడుకోలు గ్రామంలో ఆదివారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. 112 సంవత్సరాల క్రితం డెన్మార్క్ రాజధాని ఓపెన్ హగ్గిన్ ప్రాంతంలో 1910లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహిళ రెండవ మహాసభ మార్చి 8న మహిళా దినోత్సవంగా జరపాలని నిర్ణయించిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నదని అన్నారు. భూములను, ఖనిజ సంపదను ప్రభుత్వ రంగ పరిశ్రమలను, రైల్వే, విమాన యానం, ఎల్ఐసి లాంటి వాటిని కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుందని తెలిపారు. లక్షల కోట్ల బ్యాంకు బకాయిలను రద్దు చేస్తుందని, రైతుల సబ్సిడీల రూపంలో కార్పొరేట్ సంస్థలకు కాసుల వర్షం కురిపిస్తుందని దుయ్యబట్టారు. మహిళల అయిన డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలు ఇస్తానని నేటికీ ఇవ్వకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపందా నాయకులు పి రామకృష్ణ, పి ఓ డబ్ల్యు నాయకులు పీ. రమ సత్యక్క, ఆర్ రమేష్ తదితరులు మాట్లాడారు. ప్రజాపంథా నాయకులు అనిస్, కిరణ్, మనోజ్, సురేష్, నిమ్మల రాములు, పీవోడబ్ల్యూ నాయకురాలు మానస, ఆర్.పుష్పలత, సరిత, గంగామణి, స్వరూప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోదావరి

రూ. కోటి 90 లక్షల పనులకు భూమిపూజ

నవతెలంగాణ-మాక్లూర్



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

మండల కేంద్రంలోని సీసీ రోడ్లకు, డ్రైనేజీలకు రూ. కోటీ90లక్షలతో సర్పంచ్ అశోక్ కుమార్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలోని వీధుల్లో గల రోడ్లకు కోటీ75లక్షలు, డ్రైనేజీలు రూ. 15 లక్షలతో పనులు ప్రారంభించా మన్నారు. నిధులు కేటాయించి నందుకు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వార్డు మెంబర్లు లక్ష్మి నారాయణ, నరేందర్, శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, ఉపాధ్యక్షులు ఉరడి చిన్న సాయిలు, బిఆరెస్ కార్యకర్తలు దర్గాల సాయిలు, శ్రీను, కుమ్మరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జోడోయాత్రపై కాంగ్రెస్ నాయకుల సమావేశం

నవతెలంగాణ-రామారెడ్డి

ఉమ్మడి జిల్లాల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జోడోయాత్రపై ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ నాయకులు ఆదివారం చర్చించారు. జోడోయాత్ర సాఫీగా జరిగే విధంగా, ప్రజా సమస్యలు తెలుసుకోవడం లక్ష్యంగా యాత్ర కొనసాగాలని, జన సమీకరణ, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్ననాటి మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-తాద్వాయి



చిన్ననాటి మిత్రుని కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. మండలంలోని అమర్ల బండ గ్రామానికి చెందిన చక్రధర్ రావు తాడ్వాయి పాటశాలలో 1998-99లో అందరితో కలిసి చదువుకున్నాడు. గత రెండు నెలల క్రితం ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న తాడ్వాయి పాఠశాల మిత్రులు అందరూ కలిసి రూ.58000 మిత్రుడి భార్యకు అందించి మానవత్వం చాటుకున్నారు. అలాగే వంట సరు కులు అందించారు. మృతిచెందిన చక్రధర్‌రావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

సదన్ విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలకేంద్రంలోని మానవతసదన్‌లో చదువుకుంటున్న 60 మంది విద్యార్థులకు ఆదివారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్పర్సన్ సంపూర్ణ స్కూల్ బ్యాగ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న జ్యోతి తన జన్మదిన వేడుకలను పిల్లల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి అందించిన బ్యాగ్‌లను చైర్పర్సన్ సంపూర్ణ చేతుల మీదుగా పిల్లలకు అందించారు. మావనతాసదన్ పిల్లలకు తమ సహకారం ఎప్పటికి ఉంటుందన్నారు. మంచిగా చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సాదన్ కేర్ టేకర్ అందే రమేష్, ప్రశాంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగినులతో సైకిల్ ర్యాలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఇందల్‌వాయి పరిధిలో మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు ఫిట్నెస్‌కోసం మహిళా ఉద్యోగినులతో సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల్లో ఫిట్నెస్ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఇది ప్రజలలో పూర్తి అవగాహన కలిగేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అరుంధతి, భానుప్రియ, ఎంఎల్ హెచ్‌పిలు పాల్గొన్నారు.

పీఎంపీలు గ్రామస్థాయిలో మెరుగైన సేవలు అందించాలి

నవతెలంగాణ-లింగంపేట్



పీఎంపీలు గ్రామస్థాయిలో మెరుగైన సేవలు అందించాలని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణగౌడ్ అన్నారు.
ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పీఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందస్తుగా పీఎంపీ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షులు జొన్నలరాజు, గౌరవ అధ్యక్షులు భీమ్రాజ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రామారావు తదితరులున్నారు.